Digital, tmedia.net.in

# టీ-మీడియా

మెయిన్ ఎడిషన్

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 297
పేజీలు : 3
శనివారం 30.05.2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## ముగిసిన బండి భగీరథ్ పోలీసు కస్టడీ

- చర్లపల్లి జైలుకు తరలింపు



**టి మీడియా, మే 29, హైదరాబాద్ బ్యూరో:** పోక్సో కేసులో నిందితుడైన బండి భగీరథ్‌ను పోలీసులు మూడో రోజు విచారణ చేశారు. పేట్?బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో అతడిని పలు ప్రశ్నలు అడిగారు. నేటితో భగీరథ్ మూడు రోజుల పోలీస్ కస్టడీ ముగిసింది. ఈ నేపథ్యంలో నిందితుడిని మల్కాజ్?గిరి కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు. అనంతరం కోర్టు ఆదేశాలతో చర్లపల్లి జైలుకు తరలించారు. ఇన్‌స్టా, వాట్సాప్ చాటింగ్ ఆధారంగా : విచారణలో పోలీసులు ప్రధానంగా బాధితురాలితో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్? అయిన ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, స్నాప్‌చాట్‌లలో చాటింగ్‌లకు సంబంధించిన వాటిపై ప్రశ్నించినట్లు సమాచారం. ఇందులో ఇప్పటికే కొన్ని ఆధారాలను సేకరించారు. వాటి ఆధారంగానే బండి భగీరథ్‌ను లోతుగా ప్రశ్నించినట్లు తెలుస్తోంది. కేసు దర్యాప్తు అధికారి డీసీపీ రితిరాజ్, పేట్‌బషీరాబాద్ సీఐ విజయ్‌వర్ధన్ ఆధ్వర్యంలో(పోలీసు కస్టడీ) నిందితుడి పోలీసు విచారణను పూర్తి చేశారు.

# విద్యార్థినులకు ప్రతినెలా 3 పీరియడ్స్ సెలవులు

- మహిళలకు 6నెలలపాటు ప్రసూతి లీవ్స్
- యూడీఎఫ్ గవర్నమెంట్? పాలసీ డిక్లరేషన్




**టీ మీడియా ,మే 29, తిరువనంతపురం :** కేరళలో చదువుకునే అమ్మాయిలకు ప్రతినెలా మూడు రోజులపాటు పీరియడ్స్ (రుతుక్రమం)? సెలవులు ఇవ్వాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే అసంఘటిత రంగాల్లో పనిచేసే మహిళలకు జీతంతో కూడిన 6 నెలల ప్రసూతి (మెటర్నిటీ) సెలవులు అమలు చేయాలని నిశ్చయించింది.కేరళ 16వ అసెంబ్లీ మొదటి సమావేశాల సమయంలో ఆ రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్? ప్రసంగిస్తూ కీలక విషయాలు వెల్లడించారు. కొత్తగా ఏర్పడిన వీడీ సతీశన్? ప్రభుత్వం రాష్ట్ర అసలు ఆర్థిక పరిస్థితిని ప్రజల ముందు ఉంచుతుందని పేర్కొన్నారు. ఇందుకోసం త్వరలోనే పూర్తి వివరాలతో కూడిన ఒక శ్వేతపత్రం విడుదల చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగానే విద్యార్థినులకు ప్రతి నెలా 3 రోజుల రుతుక్రమ సెలవులు, అసంఘటిత రంగంలోని మహిళలకు 6 నెలల ప్రసూతి సెలవుల నిర్ణయాన్ని ప్రకటించారు.

### ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక నియామకాలు

ఎస్సీ, ఎస్టీలకు ప్రాతినిధ్యం తక్కువగా ఉన్న ప్రభుత్వ శాఖల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నియామకాలు చేపడుతుందని గవర్నర్ తెలిపారు. దీని వల్ల గిరిజన భూ చట్టాలపై ఉన్న ఆందోళనలు తీరుతాయని ఆయన పేర్కొన్నారు. అంతేకాదు అవసరమైన భూచట్టాల్లో మార్పులు తెస్తామన్నారు. కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికకు ప్రాధాన్యత ఇస్తూ ఒక మీడియా సిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు. అలాగే అంతర్జాతీయ చలన చిత్రోత్సవాన్ని ఇతర నగరాల్లో కూడా నిర్వహిస్తామని తెలిపారు.

### ఉచిత ఆరోగ్య బీమా పథకం

గవర్నర్ కేరళ యూడీఎఫ్ ప్రభుత్వ పాలసీని వివరిస్తూ మరో కీలక విషయాన్ని వెల్లడించారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉమెన్? చాందీ పేరుతో సరికొత్త ఉచిత ఆరోగ్య బీమా పథకాన్ని యూడీఎఫ్ ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. ఉమెన్? 'చాందీ ఆరోగ్య బీమా పథకం' కింద ఒక కుటుంబానికి ఏడాదికి రూ.25 లక్షల వరకు బీమా సదుపాయం కల్పిస్తామని చెప్పారు. అయితే ఈ పథకాన్ని ఎలా అమలు చేస్తారు? ఎప్పటి నుంచి ఇది అందుబాటులోకి వస్తుంది? అనే వివరాలను మాత్రం ఆయన చెప్పలేదు. అంతేకాదు ప్రస్తుతమున్న 'కారుణ్య బీమా పథకం'ను మార్చి దీనిని తెస్తారా? లేదా ఇతర బీమా పథకాలను ఇందులో కలుపుతారా అనేది కూడా ఇంకా తెలియాల్సి ఉంది.

ప్రతిపక్షాల విమర్శలు

ప్రభుత్వ విధాన ప్రసంగంపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేశాయి. గవర్నర్ ప్రసంగంలో ఎలాంటి స్పష్టమైన విధానాలు కానీ, కేరళ భవిష్యత్తుకు సంబంధించిన రోడ్?మ్యాప్ కానీ లేవని ప్రతిపక్ష నేత పినరయి విజయన్? ఆరోపించారు. అసలు ప్రభుత్వానికి ఒక స్పష్టమైన విజన్? లేదని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాన్ని నిర్లక్ష్యం చేస్తుంటే, యూడీఎఫ్? ప్రభుత్వం మాత్రం మౌనంగా ఉందని మండిపడ్డారు. కష్టకాలంలో ఉన్న రాష్ట్రాన్ని ఆదుకునేలా ఎలంటి ప్రకటనలు చేయలేదన్నారు. కేరళ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని చూపించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తాము (ఎల్?డీఎఫ్?) అధికారం నుంచి తప్పుకునేటప్పుడు కూడా, ప్రభుత్వ ఖజానాకు రూ.5,429 కోట్లకుపైగా బదిలీ చేశామని విజయన్ పేర్కొన్నారు. అయితే ఈ విషయాన్ని సతీశన్ ప్రభుత్వం దాచిపెడుతోందన్నారు. పారిశ్రామిక రంగం, కిఫ్బీ , కుటుంబశ్రీ పథకాల గురించి ప్రభుత్వం మాట్లాడడం లేదని విమర్శించారు. ప్రభుత్వం తన వాగ్దానాల నుంచి పక్కకు తప్పుకుంటోందని ఆరోపించారు. గత ఐదేళ్లలో కేరళ రాష్ట్ర రుణాలు 5 శాతం మేర తగ్గాయని, దేశంలో ఎక్కువ అప్పులున్న మొదటి 18 రాష్ట్రాల జాబితాలో కేరళ లేదని పినరయి విజయన్ గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వ తీరు చూస్తుంటే, కేరళ అభివృద్ధి ఆగిపోతుందేమోనని ఆందోళన వ్యక్తం చేశారు.

### ఆ విషయంలో ప్రభుత్వ నిర్ణయం రైటే

కానీ వందేమాతరం గీతం విషయంలో కొత్త ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైనదేనని పినరయి విజయన్? అన్నారు. వందేమాతరం పాడేటప్పుడు లేచి నిలబడాల్సిన అవసరం లేదని, అలాగే ఆ గీతాన్ని పూర్తిగా పాడాలనే నిబంధన కూడా ఏమీ లేదని చెప్పారు. అయితే, వందేమాతరం గీతాన్ని పూర్తిగా ఆలపించకపోవడం గౌరవప్రదం కాదని బీజేపీ ఎమ్మెల్యే వి మురళీధరన్? విమర్శించారు.

### అది పొరపాటున జరిగిందా?

కాగా, గవర్నర్ ప్రసంగం చేసే సమయంలో డీజీపీ అసెంబ్లీలోకి రావడం ప్రోటోకాల్ ఉల్లంఘన అవుతుందని పినరయి విజయన్ అన్నారు. ఈ విషయాన్ని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. సాధారణంగా గవర్నర్ ప్రసంగం సమయంలో డీజీపీ అసెంబ్లీలో ఉండకూడదనే సంప్రదాయం ఉందని ఆయన చెప్పారు. దీనిపై స్పీకర్ స్పందిస్తూ, పొరపాటున లేదా నిర్లక్ష్యం వల్ల అలా జరిగి ఉండవచ్చని అన్నారు.

### ముఖ్యమంత్రి ఎందుకు మాట్లాడడం లేదు?

మరోవైపు ప్రతిపక్ష పార్టీలపై కేంద్ర ప్రభుత్వం ఈడీ దాడులు చేయిస్తూ, వేట కొనసాగిస్తోందని పినరయి విజయన్ ఆరోపించారు. కేజ్రీవాల్ విషయంలో ఈ విషయం స్పష్టమైందని, బీజేపీయేతర నాయకులపై కేంద్రం ఈడీని ఒక ఆయుధంగా వాడుతోందని విమర్శించారు. ఈ విషయంపై కేరళ ముఖ్యమంత్రి ఎందుకు మాట్లాడడం లేదో తనకు అర్థం కావడంలేదన్నారు. బీజేపీ చర్యలకు వ్యతిరేకంగా అందరూ కలిసికట్టుగా నిలబడాలని ఆయన పిలుపునిచ్చారు. తన కుమార్తె వీణ బ్యాంక్? ఖాతాను క్లోజ్ చేశారని, అయితే అందులో పెద్దగా డబ్బులు ఏమీ లేవని పినరయి విజయన్? స్పష్టం చేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ డబుల్ గేమ్ ఆడుతోందని, తమపై కేసులు వేస్తే బాధపడుతూ, ఇతరులపై కేసులు వస్తే సంతోషిస్తోందని విమర్శించారు.

## దేశంలో ఒక్క రోజే...

# 3,400 మరణాలు

- ఐదు రోజుల వడగాలుల వల్ల 30,000 మరణాలు
- ఇండియా ఎనర్జీ అండ్ క్లైమేట్ సెంటర్



**టీ మీడియా మే.29 ,ఢిల్లీ బ్యూరో :** దేశవ్యాప్తంగా వడగాలులు బీభత్సం సృష్టిస్తున్న వేళ ఓ అధ్యయనం షాకింగ్ విషయాలను వెల్లడించింది. దేశంలో తీవ్రమైన ఎండ, వడగాలులు నమోదైన రోజు సగటున సుమారు 3,400 అదనపు మరణాలు సంభవిస్తున్నాయని తాజా అధ్యయనం అంచనా వేసింది. ఇదే పరిశోధన మరో భయంకర విషయాన్ని కూడా చెప్పింది. వడగాల్పుల తీవ్రత వరుసగా ఐదు రోజుల పాటు కొనసాగితే, ఆ మరణాల సంఖ్య ఏకంగా 30,000 వరకు చేరుకునే అవకాశం ఉందని అధ్యయనం హెచ్చరించింది. పర్యావరణ మార్పులు దేశంలోని ప్రజల మరణాలకు ఎలా కారణం అవుతున్నాయనేది ఈ అధ్యయనం స్పష్టం చేసింది.అమెరికాలోని 'యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా బర్కిలీ'కి చెందిన 'ఇండియా ఎనర్జీ అండ్ క్లైమేట్ సెంటర్' పరిశోధకులు పియూష్ నారంగ్, అశోక్ గాడ్గిల్ ఈ అధ్యయనం చేశారు. భారత్?లోని అన్ని జిల్లాల్లో మరణాలను అంచనా వేసేందుకు ఈ బృందం దేశంలోని 10 నగరాల్లో తీవ్రమైన ఎండ, వడగాలులకు సంబంధిత మరణాలను విశ్లేషించింది. ఈ అధ్యయనం ఫ్రాంటియర్స్ ఇన్ ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ అనే జర్నల్‌లో ప్రచురితమైంది. దేశంలోని సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (జ=ా) నుంచి సేకరించిన జిల్లా స్థాయి మరణాల రికార్డులు, 2024 జనాభా అంచనాలను విశ్లేషించి పరిశోధకులు ఈ నివేదికను రూపొందించారు.

### అదనపు మరణాలు' డేటా ఆధారంగా

ఈ అధ్యయనానికి సంబంధించిన విషయాలను పరిశోధకులు పీయూష్ నారంగ్, అశోక్ గాడ్గిల్ వెల్లడించారు. ప్రపంచవ్యాప్త అధ్యయనాలు వేడికి సంబంధిత మరణాలు పెరుగుతున్నాయని చెబుతున్నప్పటికీ భారత్‌లోని పలు జిల్లాల్లో వడగాలులు మరణాలను ఎలా ప్రభావితం చేస్తాయనే దానిపై సరైన సమాచారం అందుబాటులో లేదన్నారు. ఈ నేపథ్యంలో నమోదైన 'అదనపు మరణాలు' డేటా ఆధారంగా పరిశోధకులు ఈ నివేదికను రూపొందించారు. ప్రజారోగ్యం విభాగంలో 'అదనపు మరణాలు' అనేది ఒక నిర్దిష్టమైన కొలమానంగా చెబుతుంటారు. అకస్మాత్తుగా సంభవించే ప్రకృతి వైపరీత్యాలు, మహమ్మారులు, తీవ్రమైన

మిగతా 3లో..

# మేం వచ్చేస్తున్నాం

- ఎక్కడి దొంగలు అక్కడే గప్‌చుప్?!




**టి మీడియా, మే 29, హైదరాబాద్ బ్యూరో:** కాలుష్య నియంత్రణ మండలి నిర్వహించే కంప్యూటరైజ్డ్ తనిఖీలపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'ఈ నెలలో చెకింగ్ ఉంది' అనే సమాచారం అటు పరిశ్రమల నిర్వాహకులకు, ఇటు అధికారులకు ముందే లీక్? చేస్తుండటంతో ఉల్లంఘనులకు ఒక వరంగా మారింది. దీనివల్ల లొసుగులు బయటకు రాకుండా జాగ్రత్తపడటం, లేదా అధికారులను ప్రలోభాలకు గురి చేస్తున్నారనే ఆరోపణలు పెద్ద ఎత్తున ఉన్నాయి.అధికారిక వెబ్?సైట్?లో సమాచారం : ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కార్యక్రమంలో భాగంగా సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ డెవలప్? చేసిన టూల్ ద్వారా కాలుష్య నియంత్రణ మండలి కంప్యూటరైజ్డ్ తనిఖీలు చేపడుతోంది. ప్రతి నెలా 70 నుంచి 120 వరకు పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహిస్తుండగా, ఇందులో సుమారు 30 రాజధాని పరిధిలోని మూడు జిల్లాల్లో ఉంటున్నాయి. ఏ అధికారి తనిఖీ చేయాలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆఫీస్?లో స్పెషల్? టీం దిశానిర్దేశం చేస్తుండగా, తనిఖీల సమాచారం అధికారిక వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తున్నారు. దీనివల్ల చెకింగ్ ఎప్పుడు ఉందనే విషయం ముందే తెలిసిపోతుంది. ఈ వ్యవస్థను నిలిపేసి ఉన్నట్టుండి ఆకస్మిక తనిఖీలు, నిత్యం నిఘా ఉండే ప్రత్యేక వ్యవస్థను తీసుకురావాలని పర్యావరణవేత్తలు డిమాండ్ చేస్తున్నారు.

### జరుగుతోంది ఇలా

పరిశ్రమల కాలుష్య ఉద్గారాల సామర్థ్యం ఆధారంగా అత్యధిక కాలుష్యం ఉండే రెడ్ కేటగిరీ, మధ్యస్థం ఉండే ఆరెంజ్ కేటగిరీ, తక్కువ కాలుష్యం ఉండే గ్రీన్ కేటగిరీల వారీగా చెకింగ్? చేయాలి. గత కంప్లయన్స్ రికార్డులు (నిబంధనల అమలు రికార్డులు) ఆధారంగా నిబంధనలు పాటిస్తున్నారో లేదో చెక్ చేయాలి. టూల్ ఆధారంగా ఇన్‌స్పెక్టర్లకు తనిఖీలను ర్యాండమ్‌గా లేదా రిస్క్ ఆధారంగా ఇస్తారు. తనిఖీ తర్వాత వాటర్, ఎయిర్‌యాక్ట్ ఆధారంగా ఇన్‌స్పెక్షన్ రిపోర్టును 72

మిగతా 3లో..

# వంతెన కూలి ఆరుగురు మృతి



**టి మీడియా, మే 29, హమీర్‌పూర్:** ఉత్తర్ ప్రదేశ్ హమీర్‌పూర్లో ఘోర ప్రమాదం సంభవించింది. నిర్మాణంలో ఉన్నవంతెన కూలి ఆరుగురు మృత్యువాతపడ్డారు. తీవ్రమైన తుఫాను కారణంగా నిర్మాణంలో ఉన్న వంతెన కూలిపోయింది. పలువురు శిథిలాల కింద చిక్కుకున్నట్లు అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న అధికారులు, పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. ఘటనా స్థలంలో పోలీసు బృందాలు, స్థానికులు సహాయక చర్యలు చేపడుతున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.మొరకందర్ నుండి కందౌర్ గ్రామం వరకు విస్తరించి ఉన్న ఈ వంతెనను బేత్వా నదిపైనిర్మిస్తున్నారు. వంతెన వద్ద పనులు జరుగుతున్న సమయంలో అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 2 గంటల ప్రాంతంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. వర్షం కురుస్తుండగా, కొందరు కూలీలు ఒక 'హైడ్రా' యంత్రం కింద నిలబడి ఉన్నారు. భారీ వర్షం, తుఫాను మధ్య ఈ విషాదం చోటుచేసుకోవడం, నిర్మాణ స్థలంలోని భద్రతా చర్యల పట్ల ప్రశ్నలను లేవనెత్తింది. బాధితుల్లో అత్యంత పిన్నవయస్కుడిని, ఉత్తరప్రదేశ్‌లోని బాందా జిల్లా చిల్లా గ్రామానికి చెందిన 19 ఏళ్ల కుల్‌దీప్ నిషాద్‌గా గుర్తించారు.

### ఆరుగురు బాధితుల వివరాలు.

లోకేంద్ర, 22 ఏళ్ల రాధేశ్యామ్ నిషాద్ కుమారుడు, చిల్లా నివాసి ప్రేమ్‌చంద్ కుమారుడు 19 ఏళ్ల కుల్దీప్ నిషాద్సా వంత్ యాదవ్, 28 ఏళ్ల భూరాఘర్ టెస్సిడెంట్బండాలోని ఘురాఘర్‌కు చెందిన 30 ఏళ్ల సభజిత్పుష్పేంద్ర సింగ్ చౌహాన్, 34 ఏళ్ల రాజేంద్రసింగ్ కుమారుడు, స్వాసా ఖుర్ద్ నివాసిఅచ్‌పురాకు చెందిన 42 ఏళ్ల రాజేష్ పాల్.రెండు మృతదేహాలను వెలికితీశారు, కాగా నలుగురు ఇంకా చిక్కుకునే ఉన్నారు. స్తంభంపై చిక్కుకుపోయిన మరో ముగ్గురిని అవధేష్ నిషాద్, కల్లు యాదవ్, రాజేష్ నిషాద్‌గా గుర్తించామని హమీర్‌పూర్ సర్కిల్ ఆఫీసర్ రాజేష్ కమల్ మీడియాకు తెలిపారు.



# గాలివాన బీభత్సం - విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలు

- **కృష్ణా జిల్లాలో ఇద్దరు,కర్నూలు జిల్లాలో రైతు మృతి**

**టీ మీడియా మే,29 ,అమరావతి:** రాష్ట్రం ఒకవైపు తీవ్రమైన ఎండల తాకిడికి మరోవైపు ఈదురు గాలుల ఉద్ధృతికి అతలాకుతలమవుతోంది. అనేక ప్రాంతాల్లో బలమైన గాలులతో కూడిన వర్షాలు రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. కృష్ణా జిల్లాలో ఇద్దరు వ్యక్తులు, కర్నూలు జిల్లాలో ఒక రైతు ప్రాణాలు కోల్పోయారు.

గాలివానకు నష్టపోయిన రైతు

కృష్ణా జిల్లాలోని కోడూరు మండలం కుమ్మరిపాలెంలో బలమైన గాలుల కారణంగా ఒక తాటిచెట్టు నేలకూలింది. కుమ్మరిపాలెంకు చెందిన ఇద్దరు నివాసులు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా ఆ తాటిచెట్టు విరిగి నేరుగా వారిపై పడింది. ఆ ఇద్దరూ అక్కడికక్కడే మరణించారు. ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం బాధితుల కుటుంబాలకు అండగా ఉంటుందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ హామీ ఇచ్చారు. ఈదురు గాలుల ప్రభావంతో మోపిదేవి మండలం మెల్లమెర్తిలంకలో మామిడి చెట్ల నుంచి కాయలు రాలిపడ్డాయి. కోసురివారిపాలెంలో అరటి తోటలు నేలమట్టమయ్యాయి. లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ, తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

పిడుగు పడి రైతు మృతి

కర్నూలు జిల్లా నందవరం మండలం ఇబ్రహీంపూరానికి చెందిన కృష్ణ అనే రైతు పిడుగుపాటుకు చెట్టు నేలకూలడంతో మరణించారు. ఆయన ఒక జత ఎద్దులతో తన పొలానికి వెళ్తుండగా ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం మొదలైంది. వర్షం నుంచి రక్షణ కోసం కృష్ణ ఒక చెట్టు కింద తలదాచుకున్నారు. కానీ ఆ చెట్టుపై పిడుగు పడింది. దాంతో ఆ చెట్టు విరిగి ఆయనపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ని ఆసుపత్రికి తరలిస్తుండగా ఇబ్రహీంపూరం సమీపంలోని ఒక వాగు పొంగి ప్రవహించడంతో వారి ప్రయాణానికి అంతరాయం కలిగింది. ఒక పోక్లైన్ యంత్రం సహాయంతో వాగును దాటించినప్పటికీ ఆ రైతు ప్రాణాలను కాపాడలేకపోయారు.



నేలమట్టమైన అరటితోటలు

బాపట్ల జిల్లా భాటిప్రోలు మండలం పరిధిలోని 'లంక' గ్రామాల్లో ఈదురు గాలుల తీవ్రతకు 500 ఎకరాల్లో విస్తరించి ఉన్న అరటి తోటలు నేలమట్టమయ్యాయి. పంట చేతికి వచ్చే సమయానికి ఇలా నాశనమైపోయిందని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఎకరానికి 60 నుంచి 70 వేల దాకా కౌలు ఉంటుంది. ఎకరానికి దాదాపు 900 వరకు మొక్కలు వేస్తాం. అప్పుడు సుమారుగా రూ. 1,50,000 వరకు ఖర్చు అవుతుంది. ఈ పంట కోసం పెట్టే పెట్టుబడి ఖర్చు రూ. 80,000 దాకా అవుతుంది. ఒక వేళ పంట నాశనం అవకుండా ఉంటే ఇంచుమించు రూ. 5,00,000 దాకా ఆదాయం వస్తుంది. కానీ ఇప్పుడు రూ. 4,00,000 దాకా ఖర్చు అయ్యింది. ఇప్పుడు ఇదంతా నష్టపోయాం. ప్రభుత్వం ఏదైనా సహాయం చేస్తుందని ఆశిస్తున్నాం" - నష్టపోయిన అరటి తోట రైతులు

పైకప్పుతో పాటు ఎగిరిపోయిన ఇంట్లో సామాన్లు

కడప జిల్లా ముద్దనూరు మండలం అరవేటిపల్లెలో అరటి పంటలు నేలకూలాయి. జమ్మలమడుగు రైల్వే స్టేషన్‌లో రెండు ప్లాట్‌ఫారాల పైకప్పులు గాలుల ధాటికి ఎగిరిపోయాయి. జమ్మలమడుగు పట్టణంలో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలాయి. మైలవరం మండలంలో అరటి, బొప్పాయి పంటలకు కూడా తీవ్ర నష్టం వాటిల్లింది. మార్కాపురం జిల్లా, త్రిపురాంతకం మండలంలోని పాత అన్నసముద్రంలో, పలు ఇళ్ల పైకప్పు రేకులు పెకిలించుకుపోయాయి. గృహోపకరణాలు దెబ్బతిన్నాయి. చెట్లు నేలకూలాయి.

# నైరుతి రాక ఈసారి మరింత ఆలస్యం

**- తెలంగాణలోకి ప్రవేశించేది ఎప్పుడంటే?**



**టి మీడియా, మే 29, హైదరాబాద్ బ్యూరో:** ఎల్?నినో ప్రభావంతో ఈ ఏడాది వానాకాలం కొంత ఆలస్యంగా ప్రారంభం కానుంది. ప్రస్తుతం వాతావరణ శాఖ వెల్లడించిన సమాచారం ప్రకారం జూన్ ఐదో తేదీ తర్వాతే తెలంగాణను నైరుతి రుతుపవనాలు తాకుతాయని తెలుస్తోంది. భారతదేశ దక్షిణ ప్రాంతాన్ని ఈ నెల 25న తాకుతాయని వాతావరణ శాఖ తొలుత అంచనా వేసినా ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రుతుపవనాల కదలికల్లో వేగం అధికంగా తగ్గింది.ఇప్పటి వరకు హిందూ మహాసముద్రం, బంగాళాఖాతంలో విస్తరిస్తూ వచ్చిన పవనాలు శ్రీలంక సగం వరకు వచ్చి ఆగిపోయాయి. ఈ ఏడాది వానాకాలంలో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని ఇప్పటికే భారత వాతావరణ శాఖ ప్రకటించిన సంగతి తెలిసిందే. సాధారణంగా అయితే మే నెల చివరికల్లా తెలంగాణ రాష్ట్రాన్ని రుతుపవనాలు చేరుకోవాల్సి ఉంది. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో జూన్? 5వ తేదీ నుంచి 10వ తేదీ మధ్య రావొచ్చని అంచనా వేస్తున్నారు. దీంతో జులై, ఆగస్టు, సెప్టెంబరు నెలల వర్షాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.



## రెండు కుటుంబాల మధ్య భూవివాదం

- **ఆరుగురి దారుణ హత్య**

**టీ మీడియా మే,29 ,విజయపుర :** కర్ణాటకలోని విజయపుర భీమాతీర ప్రాంతంలో ఆస్తి వివాదం కారణంగా ఆరుగురు వ్యక్తులు అత్యంత కిరాతకంగా హత్యకు గురయ్యారు. బాధితులపై మొదట పదునైన ఆయుధాలతో దాడి చేసి, ఆ తర్వాత అత్యంత సమీపం నుంచి తుపాకీతో కాల్పులు జరిపి ప్రాణాలు తీసినట్లు తెలుస్తోంది. ఈ దారుణ ఘటన చడచణ తాలూకాలోని గోవిందపుర గ్రామంలో జరిగిందని విజయపుర పోలీసు వర్గాలు వెల్లడించాయి.

**మృతుల వివరాలు**

ప్రత్యర్థులు జరిపిన కాల్పుల్లో నిరాలే కుటుంబానికి చెందిన ఐదుగురు- చందు నిరాలే, దుండప్ప నిరాలే, శివపుత్ర నిరాలే, రాహుల్ నిరాలే, సమర్థ్ నిరాలే మరణించగా, వారి అనుచరుడు షబ్బీర్ నదాఫ్ కూడా ప్రాణాలు కోల్పోయాడు .ప్రస్తుతం మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించగా, ఫోరెన్సిక్ నిపుణులు ఘటనా స్థలం నుంచి ఆధారాలు సేకరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ హత్యలు ముందస్తు ప్రణాళిక ప్రకారమే జరిగాయని, రెండు వర్గాల మధ్య ఉన్న చిరకాల భూవివాదంతో వీటికి సంబంధం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ప్రస్తుతానికి అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో, శాంతి భద్రతలను కాపాడటానికి ఆ ప్రాంతంలో అదనపు పోలీసు సిబ్బందిని మోహరించారు. కాగా, గ్రామ పెద్దలు గతంలో ఈ వివాదాన్ని పరిష్కరించడానికి ప్రయత్నించారని, కానీ సమస్య పరిష్కారం కాలేదని స్థానికులు చెబుతున్నారు. పంచాయితీ జరుగుతుండగా, ఒక్కసారిగా మారణాయుధాలతో దాడి చేసి, కాల్పులు జరపడంతో స్థానికులు భయాందోళనలు చెలరేగాయని చెబుతున్నారు.ఇటీవల ఉత్తర కర్ణాటకలోని కొన్ని ప్రాంతాల్లో తరచుగా వర్గ పోరాటాలు, పరస్పర దాడుల కేసులు నమోదు అవుతున్నాయి. కాగా, తాజా ఘటన రాష్ట్రంలో హింసాకాండ పెరుగుతోందన్న విషయాన్ని స్పష్టం చేస్తోంది.

## జేసీసెట్ ఎంట్రెన్స్ ఫలితాలు విడుదల



**టి మీడియా, మే 29, హైదరాబాద్:** రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల) జూనియర్ కాలేజీల ప్రవేశాల కోసం మొదటి దశలో 18,401 మంది విద్యార్థులు ఎంపికైనట్లు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ శుక్రవారం సచివాలయంలో జేసీసెట్ ఎంట్రెన్స్ ఫలితాలను విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 229 సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో , మొత్తం 19,740 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రవేశాల కోసం 45,357 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, ఈ నెల 15న నిర్వహించిన జేసీ సెట్ పరీక్షకు 39,052 మంది విద్యార్థులు హాజరుకాగా తొలి విడతలో 18,401 మంది సీట్లు సాధించారు. మొదటి దశలో ఎంపికైన విద్యార్థులు జూన్ 7వ తేదీలోగా తమ ప్రవేశ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని మంత్రి లక్ష్మణ్ తెలిపారు. గురుకుల విద్యాసంస్థల పట్ల విద్యార్థులకు, తల్లిదండ్రులకు అపారమైన నమ్మకం ఉందని పేర్కొన్న ఆయన, ఉన్నత ప్రమాణాలను పాటించాలని అధికారులను ఆదేశించారు. ఫుడ్ పాయిజన్వంటి సంఘటనలు పునరావృతం కాకుండా నివారించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గతంలో జరిగిన లోపాలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకున్నట్లు కూడా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు.

## చివరిగింజ వరకు మద్దతు ధరతో కొనుగోలు చేస్తాం

- **మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**




**టి మీడియా, మే 29, హైదరాబాద్:** ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ నెం.1 అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. ధాన్యం, మక్కల కొనుగోళ్ల విషయంలో సిన్సియర్ గా పనిచేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ తెలిపారు. కొనుగోళ్ల అంశంపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 29 రాష్ట్రాల్లో తెలంగాణలో కొనుగోలు చేస్తున్నట్లు ఎక్కడా చేయడం లేదని వివరించారు. భారత ప్రభుత్వమే దీనిని అంగీకరించిందని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ నెంబర్ వన్ అనికేంద్రం చెబుతోందని తెలిపారు.పంట మద్దతు ధర కోసం రూ. 16 వేల కోట్లకుపైగా ఖర్చు చేశామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాకా రాష్ట్రంలో ఇప్పటివరకు ఐదు పంటలు పండాయని చెప్పారు. ఐదు పంటల్లో రికార్డు స్థాయిలో కొనుగోళ్లు జరిపామని స్పష్టం చేశారు. చివరిగింజ వరకు మద్దతు ధరతో కొనుగొలు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. యాసంగిలో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశామని, కేంద్రం 52మెట్రిక్ టన్నులే కొనుగోలు చేస్తామని చెప్పిందన్నారు. కేంద్రం కొనకున్నా.. తాము 75 లక్షల మెట్రిక్ టన్నులు కొంటున్నామని చెప్పారు. ఇప్పటివరకు 60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నామని తెలిపారు. 8 వేల 575 కొనుగోలు కేంద్రాల్లో పంటలు కొంటున్నామని వివరించారు. 13 వేల వాహనాలు, 2 లక్షల మందికి పైగా ధాన్యం కొనుగోళ్లలో పాల్గొంటున్నారని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు.ఇప్పటివరకు 11 వేల 50 కోట్లను రైతులకు చెల్లించామని లెక్కచెప్పారు. తడిసిన ధాన్యం కూడా మద్దతు ధరతో కొంటున్నామని వెల్లడించారు. 60 లక్షల ఎంటీల్లో 9 వేలకు పైగా టన్నుల తడిసిన ధాన్యం ఉందన్నారు. ఇసుక, సిమెంట్ ఫ్యాక్టరీల లారీలు ధాన్యం కోసం ఉపయోగిస్తున్నామని చెప్పారు. బెంగాల్, బీహార్ ఎన్నికల కారణంగా లేబర్ కొరత ఏర్పడిందన్నారు. కూలీలు సొంతూళ్లకు వెళ్లి రాకపోవడంతో కాస్త ఆలస్యమైందని వెల్లడించారు. బీఆర్ఎస్ వాళ్లు గతంలో 7 వేల కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేస్తే.. తాము 8 వేల 575 కొనుగోలు కేంద్రాలు పెట్టామని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు.

### పూరి గుడిసె లేకుండా

# ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తాం

- **శాసన సభ్యులు తూడి మెఘా రెడ్డి**



**టీ మీడియా, మే 29, వనపర్తి బ్యూరో :** వనపర్తి నియోజకవర్గంలో ప్రతి ఆడపడుచుకు నిరుపేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని స్థానిక శాసనసభ్యులు తోడి మేఘారెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక దాచే లక్ష్మయ్య ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన మహిళా వారోత్సవాల కార్యక్రమంలో మహిళలకు బ్యాంకు లింకేజీ చెక్కుల పంపిణీ, ఇందిరమ్మ చీరలు పంపిణీ కార్యక్రమంలో శాసన సభ్యులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికై అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తుందని తెలిపారు. డి ప్రభుత్వం మహిళలకు తొలి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, అందుకే ఏ సంక్షేమ పథకం అయినా మహిళలే ప్రాతినిధ్యం వహించే విధంగా రూపకల్పన చేయడం జరుగుతుందన్నారు. త్వరలో వనపర్తి మహిళలకు డీజిల్ బంక్ మంజూరు కాబోతుందని, 546 ఇందిరమ్మ ఇళు ఇప్పటికే మంజూరు అయ్యాయని, ప్లాట్లు లేని నిరుపేదలకు 1000 ప్లాట్లు మంజూరు చేసి అందులో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు కట్టుకునే విధంగా ప్రభుత్వానికి తాను ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో ఒక్క పూరి గుడిసె లేకుండా అన్ని పక్కా భవనాలు నిర్మించేందుకు ప్రణాళికలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ లోకల్ బాడీ ఎన్. ఖీమ్య నాయక్ మాట్లాడుతూ మహిళల చేతుల్లో సంసారం ఉంటేనే కుటుంబం బాగుపడుతుందనివివరించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కౌన్సిలర్లు సైతం మాట్లాడారు.

## పార్టీ బలోపేతానికి సమన్వయంతో పని చేస్తాం



**టీ మీడియా, మే 29 ,పెబ్బేరు :** వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించిన సమావేశంలో ఇటీవల జరిగిన మండల పట్టణ అధ్యక్షుల నియామకాలపై హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి చిన్నారెడ్డి సమన్వయంతో పెబ్బేర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులుగా రామ్ రెడ్డి(యాపర్ల) పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులుగా కొంతం దయాకర్ రెడ్డిని నియమించినట్లు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మార్కెట్ వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి తెలిపారు ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మాట్లాడుతూ పార్టీ కోసం నిత్యం కష్టపడి పనిచేసే నాయకత్వానికి బాధ్యతలు అప్పగించడం సంతోషకరమన్నారు. మండల అధ్యక్షుడు రామ్ రెడ్డి పట్టణ అధ్యక్షుడు కొంతం దయాకర్ రెడ్డి మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర జిల్లా నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలందరినీ కలుపుకుని సమన్వయంతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. గత ఎన్నికల కంటే మెరుగైన ఫలితాలు సాధించే దిశగా ప్రతి కార్యకర్తను చైతన్యపరుస్తూ గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత శక్తివంతం చేస్తామని తెలిపారు ప్రెస్ క్లబ్ లోఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రెస్ క్లబ్ సభ్యులు కూడా పాల్గొని రామ్ రెడ్డి దయాకర్ రెడ్డిలకు మిఠాయిలతో శుభాకాంక్షలు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో మండల పట్టణ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## లారీ రూపంలో వచ్చిన మృత్యువు

- **ప్రమాదంలో ముగ్గురు మృతి**




**టీ మీడియా ,మే 29, కొత్తకోట :** పుణ్యానికి పోతే పాపం ఎదురైందన్న సామెత మాదిరిగానే సాయం చేయబోతే మృత్యువు తన్నుకొచ్చింది. తమ ప్రాంతానికి చెందిన వాహనం రహదారి పక్కన నిలిచి ఉండడాన్ని గుర్తించి వారు తమ వాహనాన్ని పక్కకు నిలిపి ఆగిపోయిన వాహనం దగ్గరకు వెళ్లి వివరాలు ఆరా తీశారు. దాని టైర్ పగిలి పోవడంతో వారు టైర్?ను మారుస్తుండగా లారీ రూపంలో వచ్చిన మృత్యువు ముగ్గురిని బలితీసుకుంది. ఈ సంఘటన 44వ నంబర్ జాతీయ రహదారిపై వనపర్తి జిల్లా కొత్తకోట మండలం ముమ్మల్లపల్లి వద్ద తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం ..కొత్తకోట సీఐ రాంబాబు కథనం ప్రకారం కర్ణాటక రాష్ట్రం చిక్కబల్లాపూర్ జిల్లా బాగేపల్లికి చెందిన రవి తన బొలెరోలో కొత్తిమీరను తీసుకొని గురువారం మధ్యాహ్నం హైదరాబాద్?కు బయల్దేరాడు. మార్గ మధ్యలో అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలోని కోట సమీపంలో ఉన్న నేసేవీధికి చెందిన జగదీష్ (21) బొలెరో వాహనంలో ఎక్కాడు. అక్కడి నుంచి హైదరాబాద్?కు వెళ్తుండగా మిమ్మల్లపల్లి వద్దకు రాగానే బొలెరో కుడివైపు ఉన్న వెనుక టైర్?పగిలిపోయింది. వెంటనే డ్రైవర్ రవి వాహనాన్ని పక్కకు నిలిపాడు. పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు, రహదారి నిర్వహణ సంస్థ సిబ్బంది గుర్తించి దానికి పక్కన కోన్, ఇండికేటర్స్ ఏర్పాటు చేసి వెళ్లారు.

**మార్గం మధ్యలో ఇద్దరు మృతి**

రహదారి పక్కన ఆగి ఉన్న బొలెరో వాహనాన్ని అదే దారిలో వెళ్తున్న బాగేపల్లికి చెందిన రాజశేఖర్ (25), శివకుమార్ (24) గుర్తించి తమ వాహనాన్ని నిలిపి రవి వద్దకు వెళ్లి వివరాలు ఆరా తీశారు. టైర్ పగలడంతో మార్చాలని రవి చెప్పగా రాజశేఖర్, శివకుమార్ టైర్?ను మారుస్తుండగా అర్ధరాత్రి తమిళనాడు నుంచి హైదరాబాద్?కు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి టైర్? మారుస్తున్న ముగ్గుర్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో జగదీష్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. రాజశేఖర్ , శివకుమార్ తీవ్రంగా గాయపడగా వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్సా అందించి మెరుగైన వైద్యం కోసం తరలిస్తుండగా మార్గం మధ్యలో ఇద్దరు మృతి చెందారు. చనిపోయిన ముగ్గురు వ్యక్తులు సైతం ఒకరికి ఒకరు తెలియదు. రాజశేఖర్, శివకుమార్?లు బాగేపల్లి చెందిన వాహనం కావడంతో సాయం చేయడానికి వెళ్లి మృతి చెందారు. జగదీష్ అనే వ్యక్తి బళ్లారికి వెళ్లేది ఉండగా, హైదరాబాద్?కు వచ్చే వాహనానికి డబ్బులు కలెక్షన్ చేసే బాలకృష్ణ రాకపోవడంతో అతని స్థానంలో వచ్చి మృత్యువాత పడ్డాడు.



### రహదారిపై బైఠాయించి

## రైతుల నిరసన

**టీ మీడియా మే,29 టేక్మాల్ :** రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ, వరి ధాన్యం కొనుగోలులో జాప్యంపై టేక్మాల్ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో తమ ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా, రైస్ మిల్లర్లు ధాన్యం లోడ్ చేసిన ట్రాక్టర్లను వెనక్కి పంపిస్తున్నారని ఆరోపిస్తూ.. రైతులు శుక్రవారం టేక్మాల్ చౌరస్తాలో బోడ్మట్ పల్లి - మెదక్ ప్రధాన రహదారిపై భారీ రాస్తారోకో చేపట్టారు.ప్రభుత్వ తీరుపై భగ్గుమన్న రైతులు, ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. .ఈ నిరసనలో పాల్గొన్న బీఆర్ఎస్ మండల అధ్యక్షులు భక్తుల వీరప్ప మాట్లాడుతూ, "రైస్ మిల్లర్లు .ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా యువజన విభాగం కార్యదర్శి నాయికోటి భాస్కర్, జిల్లా నాయకులు రమేష్ నాయక్ తదితరులు పాల్గొని రైతులకు మద్దతు తెలిపారు. నిరసన కొనసాగుతున్న నేపథ్యంలో, టేక్మాల్ ఎస్సై అరవింద్ కుమార్ రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని రైతులకు నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు.




## 31న వనపర్తిలో భారీ బహిరంగ సభ

- **బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో**

**టీ మీడియా, మే 29, వనపర్తి బ్యూరో :** ఈనెల 31న ధర్మ సమాజ్ పార్టీ మద్దతుతో బీసీ,ఎస్సి, ఎస్టి జేఏసీ ఆధ్వర్యంలో సామాజిక న్యాయం రాజ్యాధికారం" కై"వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఎవరి కులం ఎంతో! వారికంత వాటా!! భారీ బహిరంగ సభ సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహిస్తున్నట్లు బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ వనపర్తి జిల్లా కన్వీనర్ చిలుక బాలరాజ్ సాగర్, వీరపాగ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ల 31న వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించే ఎవరి కులం ఎంతో! వారికంత వాటా! భారీ బహిరంగ సభకు బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ ప్రజలు, విద్యావంతులు, మేధావులు యువకులు భారీ ఎత్తున తరలిరావాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ నాయకులు అశోక్, కురుమన్న, కొండన్న యాదవ్ పిలుపునిచ్చారు.




## విదేశీ నేతలకు మెలోడీ స్వదేశీ ప్రజలకు ధరల వేడి

**టీ మీడియా, మే 29, వనపర్తి బ్యూరో :** ఇటీవల భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇటలీ ప్రధాని జార్జియా మెలోని కి మెలోడీ చాక్లెట్ ఇవ్వడం దేశవ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఆ అంశాన్ని విదేశీ నేతలకు మెలోడీ పంచే ప్రధానికి స్వదేశంలో సామాన్యుడి 'గోడు' ఎందుకు వినిపించడం లేదు అని ప్రశ్నించారు.కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించే వరకు ఎన్ఎస్యుఐ ఆధ్వర్యంలో పోరాటాలు ఆపబోమని బి. శ్రీకాంత్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా ఎన్ఎస్యుఐ ముఖ్య నాయకులు, అనిల్ కుమార్ అబ్రార్,శివ కుమార్ , శరత్ ,రాకేష్ , నరేష్ , శివ , మధు , మన్యం రఘు శివాజీ , అమర్ , జునైద్ , శ్రీకాంత్ చారి , కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వాహనదారులు పాల్గొని నిరసనకు మద్దతు తెలిపారు.

# దేశంలో నైరుతి రుతుపవనాలు



- ఈసారి సాధారణం కంటే తక్కువ వర్షాలు: ఐఎండీ

**టి మీడియా, మే 29, ఢిల్లీ బ్యూరో:** ఈ ఏడాది దేశంలో కురిసే నైరుతి రుతుపవనాల వర్షపాతం, దీర్ఘకాలిక సగటులో 90 శాతంగానే నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈ సీజన్‌లో ఈశాన్య భారతంలో సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నప్పటికీ, దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కానున్నట్లు పేర్కొంది. నైరుతి రుతుపవనాల సీజన్‌కు సంబంధించి ప్రకటించిన రెండో ముందస్తు అంచనాలో ఈ వివరాలను వెల్లడించింది. ఏప్రిల్ 13న విడుదల చేసిన మొదటి అంచనాలో దీర్ఘకాలిక సగటు వర్షపాతం 92 శాతంగా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఇప్పుడు ఆ అంచనాలను మరికొంత తగ్గించడంతో రాబోయే రోజుల్లో వర్షాభావ పరిస్థితులు ఉండే అవకాశం ఉందనే సంకేతాలను పంపింది.

### దీర్ఘకాలిక సగటుగా 90 శాతం వర్షం

వాతావరణ శాఖ డైరెక్టర్? జనరల్? డాక్టర్? మృత్యుంజయ్? మహాపాత్ర విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, "జూన్?– సెప్టెంబర్? రుతుపవన కాలంలో దేశ దీర్ఘకాలిక సగటు వర్షపాతంలో 90 శాతం వర్షాన్ని అందుకునే అవకాశం ఉంది. దీనికి ఎర్రర్ మార్జిన్ నాలుగు శాతంగా ఉంది" అని తెలిపారు. దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని ఆయన వెల్లడించారు. ప్రాంతీయ అంచనాల ప్రకారం, ఈశాన్య భారతదేశంలో దీర్ఘకాల సగటులో 94 నుంచి 106 శాతం మధ్య సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది.

అయితే మధ్య భారతదేశం, దక్షిణ ద్వీపకల్ప ప్రాంతాలు, వాయువ్య భారతదేశం, రుతుపవనాల ప్రధాన సమయంలో ఈ సారి సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. జూన్? నెల అంచనాలను అందిస్తూ, దేశంలోని చాలా ప్రాంతాల్లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా, దీర్ఘకాల సగటులో 92 శాతం కంటే తక్కువగా ఉంటుందని మృత్యుంజయ్? తెలిపారు.

### సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు

మరోవైపు, జూన్? నెలలో చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఐఎండీ అంచనా వేసింది. "మధ్య, వాయువ్య, తూర్పు భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు మినహా దేశంలోని చాలా ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా చాలా వరకు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది" అని మృత్యుంజయ్ అన్నారు. ఉత్తర్?ప్రదేశ్ ?, హర్యానా, పంజాబ్?, బీహార్?, ఒడిశా, ఛత్తీస్?గఢ్?, గుజరాత్?, ఆంధ్రప్రదేశ్?లలో సాధారణం కంటే ఎక్కువగా వడగాలులు వీచే అవకాశం ఉంటుందని వాతావరణ సంస్థ హెచ్చరించింది. మహారాష్ట్ర, తెలంగాణ, తమిళనాడులోని కొన్ని ప్రాంతాలలో కూడా వడగాలుల తీవ్రత పెరిగే అవకాశం ఉంది. సముద్ర పరిస్థితులపై మృత్యుంజయ్ మాట్లాడుతూ, "తటస్థ ఈఎన్?ఎస్?ఓ పరిస్థితులు ఎల్?నినో వైపు మారుతున్నాయని తెలిపారు. జూన్? నాటికి ఎల్?నినో పరిస్థితులు ఏర్పడే అవకాశం 82 శాతంగా ఉందని, జులై, ఆగస్టు నాటికి 90 శాతానికి పైగా పెరుగుతుందని అన్నారు. రుతుపవన కాలమంతా తటస్థ హిందూ మహాసముద్ర ద్విధ్రువ(ఐఓడీ) పరిస్థితులు కొనసాగుతాయని చెప్పారు.

### మే నెలలో నాలుగు శాతం అధిక వర్షపాతం

ఇదిలా ఉండగా, జాతీయంగా మే నెలలో వర్షపాతం సాధారమం కంటే నాలుగు శాతం అధికంగా నమోదైందని ఐఎండీ తెలిపింది. మే 27 వరకు నమోదైన మొత్తం రుతుపవన వర్షపాతం సాధారణం కంటే ఒక శాతం అధికంగా ఉందని మృత్యుంజయ్? పేర్కొన్నారు. సాధారణంగా రుతుపవనాలు ప్రారంభమయ్యే తేదీ కంటే నాలుగు రోజుల ముందుగానే, మే 16న అండమాన్? నికోబార్? దీవుల్లోకి ప్రవేశించాయని ఆయన తెలిపారు. అప్పటి నుంచి అవి దక్షిణ అరేబియా సముద్రం, లక్షద్వీప్? ప్రాంతాలోకి విస్తరించాయని, వచ్చే వారంలోగా కేరళ, ఈశాన్య రాష్ట్రాల్లోకి ప్రవేశించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని ఆయన చెప్పారు. అలాగే పశ్చిమ ఆటంకాలు, తూర్పు గాలుల ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో వాయువ్య భారతదేశం అంతటా తీవ్రమైన వేడి నుంచి ఉపశమనం లభిస్తుందని, అలాగే పలు ప్రాంతాల్లో ఉరుములు, ఈదురు గాలులు, వడగళ్ల వానలు కురిసే అవకాశం ఉందని ఐఎండి అంచనా వేసింది.

## రిజర్వ్ తీర్పులు గా 3నెలల్లోపు వెలువరించాలి'

- హైకోర్టుల్లో విచారణల జాప్యంపై సుప్రీం




**టి మీడియా, మే 29, ఢిల్లీ బ్యూరో:** హైకోర్టుల్లో విచారణలు, తీర్పుల్లో జాప్యంపై సుప్రీం కోర్టు కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. రిజర్వ్ చేసిన తీర్పులు గరిష్ఠంగా 3 నెలల్లోపు వెలువరించాలని ఆదేశించింది. వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన కేసుల్లో నిర్ణయాలు మరింత వేగంగా తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఉద్ఘాటించింది. బెయిల్ దరఖాస్తులకు సంబంధించి కూడా అత్యున్నత న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. బెయిల్ దరఖాస్తులపై విచారణ పూర్తైన రోజే ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశించింది. ఒకవేళ తీర్పును రిజర్వ్ చేస్తే, మరుసటి రోజు కచ్చితంగా తీర్పును వెలువరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని నిర్దేశించింది. ఖైదీల విడుదలకు సంబంధించి పలు నిబంధనలు విధించింది. బెయిల్ లేదా శిక్ష నిలుపుదలకు సంబంధించిన ఉత్తర్వులను వెంటనే సంబంధిత జైలు అధికారులకు పంపాలని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఆ ఉత్తర్వులు అందిన వెంటనే, విచారణలో ఉన్న నిందితులను లేదా దోషులను సాధ్యమైనంత వరకు అదే రోజు లేదా మరుసటి రోజు జైలు నుంచి విడుదల చేయాలని ఆదేశించింది. బెయిల్ ఉత్తర్వుల అమలుపై ట్రయల్ కోర్టు హైకోర్టుకు నివేదిక ఇవ్వాలని సుప్రీంకోర్టు నిర్దేశించింది. కాగా, తాము జారీ చేసిన ఆదేశాల ఉద్దేశం ఏ ప్రత్యేక న్యాయమూర్తిపైనా, హైకోర్టు తీర్పుపైనా నిందలు వేసేందుకు కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

### సుప్రీం కోర్టు ఆదేశాలు

వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన అంశాల్లో 3 నెలల కంటే ముందే తీర్పులను ఆశిస్తున్నాం.

బెయిల్ దరఖాస్తులపై అదే రోజు తీర్పులు ప్రకటించడం ఆదర్శనీయమని, ఒక వేళ తీర్పు రిజర్వు చేస్తే మర్నాడే దానిని వెలువరించాలి. బెయిల్‌పై తీర్పు వెలువడిన రోజునే జైలు అధికారులకు ఆర్డర్లను వెంటనే పంపించాలి. విచారణలోని ఖైదీలను బెయిల్ లభించిన అదే రోజున, లేకపోతే మరుసటి రోజున విడుదల చేసేయాలి. ట్రయల్ కోర్టులు నిబంధనలు పాటించిన వెంటనే ఆ విషయాన్ని సంబంధిత రాష్ట్ర హైకోర్టులకు తెలియజేయాలి. తీర్పులో అమలు చేయాల్సిన భాగాన్ని మాత్రమే ఓపెన్ కోర్టులో వెల్లడించాలి. ఇక తీర్పునకు గల కారణాలతో సహా పూర్తికాపీని ఏడు రోజుల్లోపు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. ఈ మార్గదర్శకాలను అమలు చేయడానికి సంబంధిత హైకోర్టుల వెబ్‌సైట్‌లో ఆయా చీఫ్ జస్టిస్‌ల పర్యవేక్షణలో తగిన మార్పులు చేయాలి. తీర్పు రిజర్వు చేసిన మూడు నెలల్లో వెలువరించకపోతే, దానిని రిజిస్ట్రార్ జనరల్ సంబంధిత హైకోర్టు చీఫ్ జస్టిస్ ఎదుటకు తీసుకెళ్లాలి. తీర్పు వెలువరించేందుకు చీఫ్ జస్టిస్ మరో రెండువారాల సమయం ఇవ్వొచ్చు. అప్పటి తీర్పు రాకపోతే కేసును మరో బెంచ్‌కు కేటాయించాలి. వాదనలు ముగిసి తీర్పు తేదీని రిజర్వు చేస్తే, దానిని హైకోర్టు వెబ్‌సైట్‌లో స్పష్టంగా వెల్లడించాలి. ఆయా హైకోర్టుల రిజిస్ట్రార్ జనరల్స్ ఈ మార్గదర్శకాలను తమ చీఫ్ జస్టిస్‌ల ముందుకు తీసుకెళ్లాలి. 2025లో ఝార్ఖండ్ హైకోర్టు వెలువరించిన తీర్పును వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడంపై వచ్చిన పిటిషన్‌ను విచారించి సుప్రీంకోర్టు ఈ మార్గదర్శకాలు జారీ చేసింది.

## ప్లాస్టిక్ కరెన్సీ నోట్లపై దృష్టి పెట్టిన ఆర్బీఐ!



**టీ మీడియా ,మే 29,న్యూఢిల్లీ:** పాలిమర్ లేదా ప్లాస్టిక్ కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిసింది. రోజు రోజుకూ కరెన్సీ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో.. పాలిమర్ నోట్లను ప్రవేశపెట్టేందుకు ఆర్బీఐ ప్లాన్ వేసింది. ఇటీవల పాట్నా, ముంబైలో జరిగిన ఆర్బీఐ బోర్డు సమావేశాల్లో పాలిమర్ నోట్ల గురించి చర్చ జరిగినట్లు తెలుస్తోంది. పాలిమర్ లేదా ప్లాస్టిక్ నోట్లను ప్రవేశపెట్టేందుకు విస్తృతంగా చర్చించారు. పాలిమర్ నోట్లకు ఎక్కువ సెల్ఫ్ లైఫ్ ఉంటుందని, తయారీ కోసం తక్కువ ఖర్చు అవుతుందని భావిస్తున్నారు. సంప్రదాయకర కాగితం కరెన్సీ తయారీకి ఎక్కువ ఖర్చు అవుతుంది. అంతేకాకుండా పాలిమర్ నోట్లు ఎక్కువ కాలం ఉండే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం వినియోగంలో ఉన్న పేపర్ నోట్ల కన్నా.. పాలిమర్ నోట్ల తయారీకి తక్కువ ఖర్చు అవుతుంది. ఏటీఎంల ద్వారా కూడా ఈజీగా పాలిమర్ నోట్లను పంపిణీ చేయవచ్చు అన్న ఆలోచనలో ఆర్బీఐ ఉంది. పాలిమర్ కరెన్సీ నోట్లకు చెందిన పైలట్ ప్రాజెక్టును ఆర్బీఐ త్వరలో ప్రకటించనున్నది. పేపర్ మనీ ప్రింటింగ్ కోసం అయ్యే ఖర్చు బాగా పెరిగిపోయిందని, 5101.4 కోట్ల నుంచి 6,372.8 కోట్లకు ఆ ఖర్చు చేరుకుందని ఇటీవల ఆర్బీఐ వార్షిక నివేదికలో పేర్కొన్నది. బ్యాంక్ నోట్ల ప్రింటింగ్ కోసం డిమాండ్ పెరగడం వల్ల ఖర్చు పెరిగినట్లు నివేదికలో తెలిపారు. ఇక పాడైన, పాతబడిపోయిన, చిరిగిన పేపర్ కరెన్సీ నోట్ల సంఖ్య కూడా పెరిగిపోయింది. 2025 వార్షిక సంవత్సరంలో సుమారు 23.8 బిలియన్ల చిరిగిన నోట్లను రద్దు చేశారు. ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే 12.3 శాతం అధికం. 2024 వార్షిక సంవత్సరంలో సుమారు 21.24 బిలియన్ల చిరిగిన కరెన్సీ నోట్లను రద్దు చేసినట్లు తెలిసింది. 500, 100 నోట్లు ఎక్కువగా రద్దు చేయాల్సి వచ్చిందన్నారు. 1988లో తొలిసారి ఆస్ట్రేలియా పాలిమర్ కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టింది. 1996 నాటికి ఆ దేశం పూర్తి స్థాయిలో పాలిమర్ నోట్లను వినియోగంలోకి తెచ్చింది. ఇక కెనడా 2011లో పాలిమర్ కరెన్సీ నోట్లను తెచ్చింది. అయితే పేపర్ కన్నా పాలిమర్ బెటర్ అని కెనడా అనేక విశ్లేషణలు చేసింది.

## లాయర్ ఖాజా మొయినుద్దీన్ హత్య కేసు


- వెనుక కాంగ్రెస్ నాయకుడు ఆలం ఖాన్‌తో



**టి మీడియా, మే 29, హైదరాబాద్ :** మహానగరంలో సంచలనం సృష్టించిన అడ్వకేట్ ఖాజా మొయినుద్దీన్ హత్య కేసు దర్యాప్తులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ హత్య వెనుక కాంగ్రెస్ నాయకుడు ఆలం ఖాన్‌తో పాటు అతని కుమారుడి పాత్ర ఉన్నట్లు హైదరాబాద్ పోలీసులు తేల్చారు. ఖాజా మొయినుద్దీన్‌ను హత్య చేయడానికి రూ.25 లక్షల సుపారీ ఇచ్చినట్లు విచారణలో బయటపడింది. ఈ కేసులో ఆలం ఖాన్, అతని కుమారుడితో పాటు మొత్తం ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఖాజా మొయినుద్దీన్‌ను హత్య చేయాలనే ప్రణాళిక ఒక్కసారిగా రూపొందించలేదని, గత రెండేళ్లుగా పది సార్లకు పైగా ప్రయత్నాలు జరిగినట్లు గుర్తించారు. ప్రతి ప్రయత్నం విఫలమవడంతో చివరకు సుపారీ కిల్లర్ల సహాయంతో హత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో నిందితుల మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలు, కమ్యూనికేషన్ వివరాలు కూడా కీలక ఆధారాలుగా మారాయి. ఇదిలా ఉండగా, ఆలం ఖాన్‌కు సంబంధించిన పలు పాత వ్యవహారాలు కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారుతున్నాయి. గతంలో తమిళనాడులోని ఊటీలో రూ.7 కోట్ల విలువైన బంగ్లాను కొనుగోలు చేసేందుకు ఆలం ఖాన్ ప్రయత్నించినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఆలం ఖాన్ అనుచరులుగా భావిస్తున్న నిస్సార్ హాసన్ అహ్మద్, నందీశ్ అనే ఇద్దరిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.75 లక్షల హవాలా నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆ కేసుకు సంబంధించిన పాత రికార్డులను కూడా ప్రస్తుతం పోలీసులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా ఖాజా మొయినుద్దీన్ హత్య కేసు దర్యాప్తు ముందుకు సాగుతున్న కొద్దీ ఆలం ఖాన్ వ్యవహారంలో కొత్త కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. హత్య కేసుతో పాటు ఆర్థిక నేరాలు, హవాలా లావాదేవీలు, గత క్రిమినల్ కనెక్షన్లపై కూడా పోలీసులు దృష్టి సారించడంతో ఈ కేసు మరింత సంచలనంగా మారింది. ప్రస్తుతం నిందితులను అదుపులోకి తీసుకుని పోలీసులు మరింత లోతుగా విచారణ కొనసాగిస్తున్నారు.

## ఎస్పై కావాలని ప్రయత్నించి విఫలం

- నకిలీ ఏసీబీ అధికారి అవతారమెత్తి మోసాల



**టి మీడియా, మే 29,విజయవాడ:**లో నకిలీ ఏసీబీ అధికారిగా చెలామణి అవుతూ ప్రభుత్వ అధికారులను బెదిరించి లక్షలు దోచుకున్న అనంతపురం జిల్లాకు చెందిన జయకృష్ణ మోసాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. పోలీసుల విచారణలో సంచలన విషయాలు బయటపడ్డాయి.

### లొకేషన్ దొరక్కుండా ఏసీ బస్సులో ప్రయాణం

నిందితుడు జయకృష్ణ తన ఆచూకీ చిక్కకుండా తరచూ ప్రయాణాలు చేస్తూ మోసాలకు పాల్పడేవాడు. ముందుగానే యాక్టివేట్ చేసిన సిమ్ కార్డులను గంపగుత్తగా అడ్డదారుల్లో సంపాదించి వాటితోనే అధికారులకు ఫోన్లు చేసేవాడు. కర్ణాటక సరిహద్దులో స్వగ్రామం ఉండటంతో తరచూ బెంగళూరు వెళ్లి అక్కడే మకాం వేసేవాడు. అధికారులకు బెదిరింపు కాల్స్ చేయాలనుకున్నప్పుడు బెంగళూరులో ఏసీ సిటీ బస్సు ఎక్కేవాడు. సాయంత్రం వరకు అందులోనే ప్రయాణిస్తూ లక్ష్యంగా పెట్టుకున్న అధికారులకు ఫోన్లు చేసేవాడు. డబ్బు బదిలీ కాగానే మొబైల్ స్విచ్ఛాఫ్ చేసేవాడు.

### రెండు గొంతులతో బెదిరింపులు

ఎంచుకున్న అధికారికి ఫోన్ చేసే సమయంలో రెండు గొంతులతో మాట్లాడటం నిందితుడి శైలి. తొలుత ఏసీబీ ఇన్‌స్పెక్టర్‌ను మాట్లాడుతున్నానని బెదిరించేవాడు. 'మీపై అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. త్వరలో పదవీ విరమణ చేయబోతున్నారు. త్వరగా సెటిల్ చేసుకోండి. లేకపోతే సోదాలు చేస్తాం' అని భయాందోళనకు గురి చేసేవాడు. ఆపై 'మా డీఎస్పీ మీతో మాట్లాడతారు' అంటూ తానే గొంతు మార్చి సంభాషణ కొనసాగించేవాడు. భయపడిన అధికారులు నిందితుడు సూచించిన యూపీఐ ఐడీలకు డబ్బులు బదిలీ చేసేవారు.

### బెంగళూరులో బ్యాంకు ఖాతాల సేకరణ

ప్రభుత్వ అధికారుల్లోని భయాన్ని సొమ్ము చేసుకునేవాడు. బెంగళూరులో కొందరితో పరిచయం పెంచుకొని వారి బ్యాంకు ఖాతాలను సేకరించాడు. ఆ ఖాతాల్లోకే బాధితుల నుంచి డబ్బులు మళ్లించేవాడు. ప్రస్తుతం తమ అదుపులో ఉన్న నిందితుడిని పోలీసులు విచారిస్తున్నారు. అతడి ఫోన్ స్వాధీనం చేసుకొని పరిశీలిస్తున్నారు. కాల్ డేటాను విశ్లేషిస్తున్నారు. ఇతని జాబితాలో ఇంకా ఎంత మంది ఉన్నారు, ఎవరెవరు ఉన్నారన్న కోణంలో ప్రశ్నిస్తున్నారు.

## గిరిజన విద్యార్థుల అకాల మరణాలు

- 25 రోజుల్లోనే నలుగురు మృతి



**టి మీడియా, మే 29, అమరావతి బ్యూరో:** గిరిజన విద్యార్థుల్లో కడుపునొప్పి, తలనొప్పి, గొంతునొప్పి, ఆయాసం, శరీరం ఉబ్బడం తదితర చిన్న చిన్న అనారోగ్య సమస్యలు బయటపడి అవి మరణాల వరకు వెళ్తున్నాయి. కొన్నేళ్లుగా గిరిజన పాఠశాలల్లో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి. వారికి సరైన వైద్యం అందుబాటులో లేకపోవడమే ప్రధాన కారణం. 2022 నుంచి ఇప్పటివరకు ఇలా 100 మంది మృతి చెందారు. ఒక్క 2023–24లోనే 61 మంది చనిపోయారు. గతంలో ఇలాంటి మరణాల్ని గుర్తించే వ్యవస్థ సరిగా ఉండేది కాదు. ఇటీవల దీనిని పక్కాగా నమోదు చేస్తున్నారు. చాలా ఘటనల్లో వారి మృతికి కారణాలు విశ్లేషిస్తే గుండె, కిడ్నీ వ్యాధులు, కాలేయం, ఊపిరితిత్తుల సమస్యలతో మృతి చెందినట్లు తెలుస్తుంది. ఇంకా జన్యుపరమైన సమస్యలూ ఉన్నాయి. గిరిజన విద్యార్థుల అకాల మరణాలకు కారణాలు తెలుసుకునేందుకు గిరిజన సంక్షేమశాఖ ప్రత్యేక అధ్యయనం చేయించడానికి మంగళగిరి ఎయిమ్స్‌ను సంప్రదించింది. జన్యుపరమైన సమస్యలతోనే వారు ఇలా మృతి చెందుతున్నారని వైద్యులు ప్రాథమికంగా తెలిపారు. దీనికి సమగ్ర పరీక్షలు అవసరమని చెప్తున్నారు. ఇందుకు నలుగురు వైద్యులను కేటాయించారు. అప్పటివరకు కొన్ని ఘటనల్లో వీరికి తీవ్రవ్యాధుల లక్షణాలేమీ కనిపించవు. ఉన్నట్లుండి బయటపడి, అంతలోనే చనిపోతున్నారు. గడిచిన 25 రోజుల్లో సెలవులకు ఇంటికి వెళ్లిన నలుగురు విద్యార్థులు ఇలానే మృతి చెందారు. ఒక అమ్మాయికి ఆయాసం, మరో అబ్బాయికి వాంతులు, ఇంకో పిల్లాడికి కడుపునొప్పి, మరో చిన్నారికి తలనొప్పి ఇవి వారిలో కనిపించిన లక్షణాలు. ఈ లక్షణాలు బయటపడ్డ తర్వాత వారు బతికింది 3 లేదా 4 రోజులే. 2024 నుంచి ఇప్పటివరకు కడుపు, తల, గొంతునొప్పితో మృతి చెందిన వారు 11 మంది, గుండెసమస్యతో ఏడుగురు, ఊపిరితిత్తుల సమస్యలతో ఐదుగురు, కామెర్లతో ఐదుగురు, జ్వరంతో 15 మంది ఉన్నారు.

## దేశంలో ఒక్క రోజే... 3,400 మరణాలు

వడగాల్పుల సమయంలో సాధారణం సంఖ్య కంటే ఎక్కువగా నమోదయ్యే మరణాలనే 'అదనపు మరణాలు' అని పరిగణిస్తారు. ఆ మరణాల ఆధారంగానే ఈ నివేదికను పరిశోధకులు రూపొందించారు. గత కొన్ని రోజులుగా మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, హరియాణలోని కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు మించిపోయాయి. ఉత్తర, మధ్య, తూర్పు భారతదేశంలో తీవ్రమైన వడగాలులు నమోదవుతున్నాయి. ఈ క్రమంలోనే ముఖ్యంగా దేశవ్యాప్తంగా సంభవించే మొత్తం ఎండ మరణాల్లో సింహభాగం ఐదు రాష్ట్రాల్లోనే కేంద్రీకృతమై ఉన్నట్లు అధ్యయనం గుర్తించింది. ఉత్తర్?ప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లోనే అత్యధికంగా మరణాలు నమోదవుతున్నాయని తెలిపింది. ఐదు రోజుల వడగాలుల సమయంలో ఒక్క ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోనే సుమారు 8,100 అదనపు మరణాలు సంభవిస్తున్నాయని చెప్పింది. అదే సమయంలో అహ్మదాబాద్, జైపూర్, సూరత్ వంటి జిల్లాల్లో ఒక్కోసారి 250కి పైగా అదనపు మరణాలు సంభవిస్తున్నాయని తమ నివేదికలో పరిశోధకులు పేర్కొన్నారు.

### ముప్పు తీవ్రతను బట్టి నిధులు

ఒకే రోజు తీవ్రమైన వేడి కారణంగా దేశవ్యాప్తంగా సుమారు 3,400 అదనపు మరణాలు సంభవిస్తున్నాయని మేము అంచనాకు వచ్చాయి. ఐదు రోజుల వడగాలుల వల్ల దాదాపు 30,000 మరణిస్తారు. ఎండల వల్ల తీవ్రంగా నష్టపోతున్న ఐదు రాష్ట్రాలు దేశ జీడీపీకి (+ఞా) అందిస్తున్న వాటా కేవలం 29 శాతం. కానీ మరణాల భారంలో వీటి వాటా 66 శాతంగా ఉంది. అంటే వెనుకబడిన రాష్ట్రాలపై వాతావరణ మార్పుల ప్రభావం 2.3 రెట్లు ఎక్కువ పడుతోంది. అందుకే నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ , వాతావరణ మార్పులపై జాతీయ కార్యాచరణ ప్రణాళిక కింద ఇచ్చే కేంద్ర నిధులను కేవలం జీడీపీ ఆధారంగా ఇవ్వకుండా, ముప్పు తీవ్రతను బట్టి ఇస్తే బాగుటుంది" అని పరిశోధకులు అభిప్రాయపడ్డారు.

### 100 జిల్లాల్లోనే మూడో వంతు ప్రజలు

ఇదిలా ఉండగా, దేశంలో కేవలం కొన్ని ప్రాంతాల్లోనే ఈ తీవ్రమైన వడగాల్పుల ముప్పు ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఒక ఐదు రోజుల పాటు తీవ్రమైన హీట్‌వేవ్ వస్తే సంభవించే అదనపు మరణాలలో 44 శాతం మరణాలు 100 జిల్లాల్లోనే నమోదయ్యే అవకాశం ఉందని ఈ అధ్యయనం గుర్తించింది. ఇక్కడ ఇంకో ఆసక్తికర విషయం ఏంటంటే ఈ వంద జిల్లాల్లో దేశ జనాభాలో దాదాపు మూడో వంతు ప్రజలు నివసిస్తున్నారు. మైదాన ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రత 45 డిగ్రీలు దాటితే హీట్?వేవ్?గా ప్రకటిస్తారు. అదే సమయంలో ఉష్ణోగ్రతలు 47 డిగ్రీల కంటే ఎక్కువగా ఉంటే వాటిని 'తీవ్రమైన వడగాలులు'గా వర్గీకరిస్తారు. ప్రస్తుతం దేశంలోని చాలా ప్రాంతాల్లో 45 డిగ్రీల దాటిన వేళ ఈ అధ్యయనం ప్రభుత్వానికి మేలుకొలుపు అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## మేం వచ్చేస్తున్నాం

గంటల్లోపు ఆన్‌లైన్‌లో సమర్పించాలనే రూల్స్? ఉన్నాయి. వ్యర్థాల శుద్ధి, ఎయిర్? పొల్యూషన్ మూలాలు, నియంత్రణ పరికరాలు, ఘన, హానికర వ్యర్థాల ప్రొడక్షన్, నిల్వ, పారవేత వివరాలను రిపోర్టులో పొందుపరచాలి.

### జనవాణికి ఫిర్యాదుల వెల్లువ

ఆన్‌లైన్ కంప్లైంట్ సిస్టం జనవాణికి ప్రతి నెల 50కి పైగా ఫిర్యాదులు అందుతున్నాయి. వ్యర్థాల పారబోత, చెత్త దహనం, పరిశ్రమల నుంచి ఘాటు వాసనలు వంటి సమస్యలు ఇందులో ముఖ్యంగా ఉంటున్నాయి. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల ఆధారంగా ఆయా కంపెనీల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టడంతో పాటు ఆ రిపోర్టును డ్యాష్ బోర్డులో పెడితే పారదర్శకంగా ఉంటుందన్న డిమాండ్లు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ నిర్దేశించిన దాని ప్రకారం ఘనపు మీటరు గాలిలో సూక్ష్మ ధూళికణాలు 40 మైక్రోగ్రాములు (ఎంజీ) వరకూ ఉండవచ్చని తెలిపింది. కానీ హైదరాబాద్? మహానగరంలో దీనికి రెట్టింపు స్థాయిలో 82 నుంచి 88 ఎంజీల వరకూ నమోదవుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేసింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) పరిమితి 60 ఎంజీతో చూసినా ఇక్కడ వాయుకాలుష్యం దాదాపు 35 శాతం ఎక్కువగా ఉందని స్పష్టం చేసింది. దక్షిణ భారతదేశంలో చెన్నై, బెంగళూరు వంటి నగరాల కన్నా హైదరాబాద్‌లోనే అధిక కాలుష్యం ఉన్నట్లు డబ్ల్యూహెచ్?వో గణాంకాల ద్వారా స్పష్టంగా తెలుస్తోంది. కాలుష్యం వల్ల శ్వాసకోశ సంబంధ బాధితులు అధికంగా పెరుగుతున్నారు. ఉబ్బసంతో బాధపడే వారి ఊపిరితిత్తులకు అనుబంధంగా ఉండే గాలిగొట్టాలు మూసుకొని వాపు వంటి సమస్యలు ఏర్పడుతుంది. అందువల్లే వారు శ్వాస తీసుకోవడానికి ఇబ్బందులు పడుతుంటారని వైద్య నిపుణలు వివరిస్తున్నారు. ఈ సమస్యను పూర్తిగా నివారించలేకపోవచ్చని హెచ్చరిస్తున్నారు.




## 31న ఆర్టీసీ ఉద్యోగులు డిమాండ్ డే: జేఏసీ పిలుపు

**టి మీడియా, మే 29, హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం కోసం జూన్ 2న అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31న కార్మికులందరూ డిమాండ్ డే ను పాటించాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జేఏసీ నాయకులు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కో-కన్వీనర్ బి.యాదగిరి మాట్లాడారు. గత ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి చర్యలు చేపట్టి శాసనసభలో బిల్లు కూడా పాస్ చేసిందని గుర్తు చేశారు. కేవలం విలీన తేదీని ప్రకటించాల్సిన సమయంలో ప్రభుత్వాలు మారాయని తెలిపారు. ఇటీవల ఆర్టీసీ సమ్మె సందర్భంగా మంత్రులతో కూడిన ఉపసంఘం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి అధికారికంగా ప్రకటన చేశారని తెలిపారు. ఇటీవల విలీనం కంటే ముందు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో కార్మికుల్లో తీవ్ర గందరగోళం నెలకొన్నదని అన్నారు. ఆర్టీసీ విలీనానికి అపాయింటెడ్ తేదీని తెలంగాణ ఆవిర్భావ దినమైన జూన్ 2న ముఖ్యమంత్రి ప్రకటించాలని కోరుతూ మే 31 న సింగిల్ డిమాండ్ పై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపో, యూనిట్లలో ఎర్ర బ్యాడ్జీలు ధరించి డిమాండ్ డే పాటించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు ఎం.ఎస్.అలీ, డి.గోపాల్, జె.రాఘవులు, బుద్ధ విశాల్, మనోహర్, ఎ.ఎస్.రెడ్డి, జనార్దన్, వెంకటయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు



## రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శిగా పోలా సుధాకర్

**టి మీడియా, మే 29, ఆర్మూర్ :** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కు ఆర్మూర్ పట్టణానికి చెందిన పోలా సుధాకర్‌ను తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శిగా నియమించినట్లు తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శిగా నియమించడం చాలా సంతోషంగా ఉందన్నారు. పర్యాటక ప్యాకేజీలుతనపై నమ్మకం తెచ్చిన పదవిని నమ్మకాన్ని వమ్ము చేయకుండా నమ్మకాన్ని నిలబెడతానని తెలిపారు. సభలకు వచ్చే ఆర్యవైశ్యు మహాసభలకు వచ్చే ఆర్యవైశ్యులు పూర్తిస్థాయిలో సహకరించాలని తెలిపారు సహకరించినట్లయితే సభలు విజయవంతవుతాయని తెలిపారు.

## కల్తీ మద్యం సేవించి 12 మంది మృతి

-కొందరి పరిస్థితి విషమం



**టీ మీడియా ,మే 29, ముంబై:** కల్తీ మద్యం సేవించి 12 మంది మరణించారు. అస్వస్థత చెందిన మరి కొందరి వ్యక్తుల పరిస్థితి విషమంగా ఉన్నది. కల్తీ మద్యానికి సంబంధించి 8 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. మహారాష్ట్రలోని పూణే జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పూణే, పరిసర ప్రాంతాలకు చెందిన కొంతమంది వ్యక్తులు కల్తీ మద్యం తాగారు. తీవ్ర అస్వస్థతకు గురై 12 మంది మరణించారు. పింప్రి-చింద్వాడ్‌లోని ఫుగెవాడి ప్రాంతంలో ఏడుగురు, హడప్సర్‌లోని ససనే నగర్, కాలేపడల్ ప్రాంతానికి చెందిన మరో ఐదుగురు చనిపోయారు. అనారోగ్యం పాలైన మరికొందరిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితిని అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కాగా, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఈ సంఘటనపై స్పందించారు. సమగ్ర విచారణ చేయాలని పూణే, పింప్రి-చింద్వాడ్ పోలీస్ కమిషనర్లను ఆదేశించారు. ఇప్పటి వరకు ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు చెప్పారు. కల్తీ మద్యం నెట్‌వర్క్‌ను అధికారులు గుర్తించారని, దీంతో మరిన్ని అరెస్ట్‌లు జరిగే అవకాశమున్నదని వివరించారు